ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 36.0 ı కనిష్ఠం: 23.0
ANDHRAJYOTHY
5



కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

దేవరకద్ర, మార్చి 3 : కడుపు నొప్పి భరించలేక మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన మన్యంకొండ (29) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ప్రభు కుమారుడు మన్యంకొండ రెండు రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం కౌకుంట్ల దగ్గర రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీడనున్న పీటముడులు

ధరణి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సర్కార్ పచ్చజెండా



మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- అధికారాలు దిగువకు బదిలీ చేయడంతో పనుల్లో వేగం
- ఉమ్మడి పాలమూరులో 23,946 పెండింగ్ దరఖాస్తులు
- అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 11,772..
- పట్టాదారు పాస్‌బుక్ డాటా కరెక్షన్ దరఖాస్తులే ఎక్కువ

మహబూబ్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వం భూ పరిపాలనలో పారదర్శకత.. వేగం కోసం ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే అంతకు ముందు భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం చేపట్టి, ఆ తర్వాత ధరణిని చేపట్టింది. తదనంతరం కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందజేసింది. అయితే ధరణి వచ్చాక ఎల్‌ఆర్‌యూపీ కార్యక్రమం నుంచే సమస్యలు ఉత్పన్నమవడం ప్రారంభమైంది. గతంలో లేని విధంగా భూ సమస్యలు, వివాదాలు పెరిగిపోయాయి. ఎల్‌ఆర్‌యూపీ సమయంలో నియమించుకున్న ఆపరేటర్లు తప్పులు చేయడం, రెవెన్యూ అధికారులు తప్పుడు వివరాలు నమోదు చేయడంతో భూ విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు వచ్చాయి. ఈ క్రమంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో వేలాది సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఒకరి భూములు మరొకరి పేరుపై రావడం, ఉన్న భూమి కనిపించకపోవడం, తక్కువ భూమి నమోదవడం, ఎప్పుడో విక్రయించిన వారి పేర్లు మళ్లీ ధరణిలో ఎంటర్ కావడం జరిగాయి. కాస్తుదారుల కాలమ్ ఎత్తేయడంతో పూర్వం భూములు వదిలిపోయిన జమీందారులు, భూస్వాముల పేర్లు తిరిగి సైట్‌లో నమోదు కావడంతో చాలామంది ఇబ్బందులు పడ్డారు. కొందరు ఇప్పటికీ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ధరణి ప్రారంభించినప్పటి నుంచి కేవలం కొనుగోళ్లు, అమ్మకాలు మాత్రమే వేగంగా జరుగుతుండగా, మిగతా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దాంతో ధరణిని రద్దు చేయాలనే డిమాండ్లు వచ్చాయి. కానీ ధరణి గొప్ప పాలసీ అని చెబుతూ.. గత ప్రభుత్వం ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లను పట్టించుకోలేదు. అయితే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ధరణిని రద్దు చేసి.. ఆ స్థానంలో భూమాత పోర్టల్‌ను తెస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నత స్థాయి కమిటీని వేసింది. ధరణిలో లోపాలు, భూ సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన మార్గాలపై ఆ కమిటీ విచారణ చేసింది. ప్రస్తుతం ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించిన తర్వాతే కొత్త పోర్టల్‌పై ఆలోచన చేయాలని సూచించడంతో ప్రభుత్వం ధరణి అధికారాలను వికేంద్రీకరణ చేయడంతో శుక్రవారం నుంచి సమస్యల పరిష్కారానికి అధికారులు నడుంకట్టారు.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

చనిపోయిన వ్యక్తుల పేరిట భూములను ధరణి వల్ల కేవలం ఆధార్ సీడింగ్ మార్చడంతో అమ్మడం, చనిపోయిన వ్యక్తికి బదులు వేరొకరు ధైర్యంగా ఫొటోలు దిగి.. సంతకాలు చేసి మరీ భూ విక్రయాలు చేయడం సర్వసాధారణంగా మారింది. ఉదాహరణకు అమరచింత మండలం పామిరెడ్డిపల్లికి చెందిన చిన్న బుచ్చన్న 40 సంవత్సరాల క్రితం మరణించారు. మరణించిన వ్యక్తి పేరిట సర్వే నెంబర్ 26, 27, 28, 29లలో ఆరున్నర ఎకరాల భూమి ఉండేది. 2018 సంవత్సరంలో ఆ భూమిని వేరొక వ్యక్తితో ఆధార్ సీడింగ్ చేసి.. అక్రమంగా పట్టామార్పిడి చేశారు. తర్వాత ఆ వ్యక్తి ఇంకొందరికి విక్రయించారు. అతనికి, ఆ భూమికి సంబంధం లేదని.. కేవలం ఆధార్ సీడింగ్ చేసి.. భూ బదలాయింపు చేశారని వారసులు గొడవ చేశారు. ఈ అంశంలో అప్పటి తహసీల్దార్‌పై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఇదే గ్రామంలోని మరో సర్వే నెంబర్‌లో వారసులు, హక్కుదారులకు కాకుండా వేరే మహిళకు పట్టా చేశారు.

- మరో ఘటనలో వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన కిష్టారెడ్డి పేరు మీద సర్వే నెంబర్ 112/ఆ2లో 1.13 ఎకరాల భూమి ఉండేది. ఆయన 2011 జూన్ 15న చనిపోయారు. ఆ సర్వే నెంబర్‌లో భూమి అతని పేరుపై అలాగే ఉండగానే.. అతని పేరుపై అదే మండలం వల్లభాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి పేరుపై ఎల్‌ఆర్‌యూపీ సమయంలో ఆధార్ సీడింగ్ చేశారు. ఆధార్ సీడింగ్ జరిగింది కానీ పట్టా మాత్రం కిష్టారెడ్డి పేరు మీదనే ఉండేది. కానీ.. 2021 ఏప్రిల్‌లో కిష్టారెడ్డి పేరు మీద ఉన్న భూమిని రవీందర్ రెడ్డి ఆధార్ కార్డు, ఫొటో, సంతకంతో మరో వ్యక్తికి విక్రయించారు. అయితే భూమి ఎవరిదనే విషయంలో వివాదం ఉన్నప్పటికీ.. చనిపోయిన వ్యక్తి పేరుతో ఉన్న పట్టాను మరొకరు ఆధార్ సీడింగ్ చేసుకుని.. ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇలాంటి ఘటనలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో అనేకం ఉన్నాయి. ప్రస్తుతం ధరణి పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుండటంతో బాధితులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 23,946 పెండింగ్ దరఖాస్తులు

ఏదైనా వ్యవస్థలో ఫిర్యాదు వచ్చిన తర్వాత వెంటనే పరిష్కరించడమో లేదా దాన్ని తిరస్కరించడమో చేసి.. డిస్పోజ్ చేస్తారు. కానీ ధరణిలో ఉన్న ఇబ్బందులు, మాడ్యుల్స్ సరిగా లేకపోవడం, అధికారాలు అన్నీ కలెక్టర్ లేదా సీసీఎల్‌ఏ వద్ద ఉండటంతో వందల్లో ఫిర్యాదులు వస్తున్నాయి. దాంతో పెండింగ్ దరఖాస్తులు పేరుకుపోయాయి. అలాగే సమస్యలను గుర్తిస్తూ మాడ్యుల్స్‌ను ప్రవేశపెట్టడం చాలా ఆలస్యం కావడంతో పట్టాదారులు ఇబ్బందులు పడ్డారు. ఫిబ్రవరి చివరి నాటికి ఉమ్మడి జిల్లాలో 23,946 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 11,472 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. జోగుళాంబ గద్వాల జిల్లాలో 3,097, నారాయణపేటలో 2,163, మహబూబ్‌నగర్‌లో 3,397 దరఖాస్తులు, వనపర్తి జిల్లాలో 3517 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అన్నింటి కంటే 33వ మాడ్యుల్‌కు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయి. అవి నాగర్‌కర్నూల్ జిల్లాలో 4,521 దరఖాస్తులు, వనపర్తిలో 1,175, మహబూబ్‌నగర్‌లో 2,156, నారాయణపేటలో 722, జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,199 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటానికి ప్రధాన కారణం.. ఎల్‌ఆర్‌యూపీ సమయంలో ఆపరేటర్లు తప్పుగా నమోదు చేయడం, రెవెన్యూ అధికారులు తప్పులు చేయడంతో హెచ్చు తగ్గులు పడటం, భూమి వేరొకరి పేరుపైకి వెళ్లడం, గతంలో అమ్మిన భూమి పాత పట్టాదారులకు చెందడం వంటి లెక్కలేనన్ని తప్పిదాలు దొర్లాయి. అలాగే గతంలో రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్‌లో ఉన్న భూమి కంటే ఎక్కువగా ఉన్నట్లు సృష్టించడంతో ఇప్పుడు ఆ భూమి ఎక్కడుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వీటితోపాటు ఏదైనా తప్పు జరిగినప్పుడు దాన్ని సరిదిద్దే వ్యవస్థ గతంలో తహసీల్దార్ స్థాయిలోనే ఉండేది. కానీ ధరణి వచ్చిన తర్వాత కలెక్టర్ లేదా సీసీఎల్‌ఏకే పరిధి ఉండటం, తప్పు జరిగిందని తెలిసినా కోర్టుకు వెళ్లండని అధికారులే చెప్పడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు.



తాడూరు మండలం పాల్మూరు గ్రామ శివారులో తెగుళ్ల కారణంగా ఎదగని వరి పైరు



సిర్సవాడ వద్ద ఎండుముఖం పట్టిన వరి పైరు

కలిసి రాని.. యాసంగి సాగు

- తెగుళ్ల బారిన పడిన వరి పైరు
- ఆందోళనలో రైతులు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 98,379 ఎకరాల్లో సాగు

తాడూరు, మార్చి 3: యాసంగిలో సాగు చేసిన వరి పంట వాతావరణ మార్పులతోపాటు తెగుళ్ల కారణంగా ఎండుముఖం పడుతోంది. దీంతో పెట్టుబడి సైతం వచ్చేలా లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను అధిగమించడం కోసం ఎన్నో రకాల పురుగు మందులను పిచికారి చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 2022 యాసంగిలో లక్షా 55,553 ఎకరాల్లో వరి సాగు చేయగా.. ప్రస్తుతం యాసంగిలో 98,379 ఎకరాల్లో సాగు చేశారు. రెండు సంవత్సరాలతో పోలిస్తే ఏటా వరి సాగు విస్తీర్ణం తగ్గుతోంది. వరి సాగు చేయడానికి ఎకరాకు సొంత భూమి అయితే రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు, కౌలు భూమి అయితే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి ఖర్చవుతోంది. ప్రస్తుతం పంట తెగుళ్ల బారిన పడటంతో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల లోపు మాత్రమే దిగుబడులు వచ్చే అవకాశముందని, వాటితో పెట్టుబడులు కూడా రావని రైతులు అంటున్నారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి, నష్టపోయిన వారికి పరిహారం అందించాలని కోరుతున్నారు.

నష్టపరిహారం అందించాలి

తెగుళ్లతో వరి పంట ఎదుగ లేదు. దీన్ని అధిగమించేందుకు ఎన్ని రకాల మందులు పిచికారి చేసినా ఉపయోగం లేదు. గత ఏడాది ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల మధ్య దిగుబడి రాగా.. ప్రస్తుతం తగ్గిపోనుంది. వరి సాగు చేసినందుకు అప్పులే మిగులనున్నాయి. ప్రభుత్వ నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- శంకర్‌గౌడ్, ఏటిదర్‌పల్లి రైతు

రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో.. ప్రజా పాలన



మంత్రులు, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న నాయకులు

- బలహీన వర్గాలను విస్మరించిన గత ప్రభుత్వం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- పాలమూరులో గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్‌నగర్, మార్చి 3: రాష్ట్రంలో నియంతృత్వ పాలనపోయి.. ఈ జిల్లా బిడ్డ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన ఏర్పడిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఏఎస్ఎన్ గార్డెన్‌లో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కల్లుగీత డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు కేశం నాగరాజు గౌడ్ అధ్యక్షత వహించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. బీసీ కులాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. ఎంబీసీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించి.. వెయ్యి రూపాయలు కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు బాగానే ఇచ్చిందని.. మనం అంతకన్నా బాగా చేయాలని బీసీ సంక్షేమ శాఖపై సమీక్ష చేయగా.. కేటాయించిన నిధులు ఖర్చు చేయలేదన్న విషయం తెలిసి ఆశ్చర్యపోయానన్నారు. ఇవి తన లెక్కలు కాదని, అధికారులు ఇచ్చిన సమాచారమేనని చెప్పారు. మన పక్షాన బీసీల గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపించి, పార్లమెంట్‌కు పంపించాలన్నారు. తెలంగాణ నుంచి 17 ఎంపీ స్థానాలు గెలిపించి కేంద్రానికి పంపిస్తే కేంద్రం నుంచి రాష్ట్రానికి అధిక నిధులు వస్తాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 48 గంటల్లోనే రెండు హామీలు ఇచ్చామని, రెండ్రోజుల క్రితమే మరో రెండు హామీలను అమలు చేశామని చెప్పారు. ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు.

గీత కార్మికుల పింఛన్ పెంచే ఆలోచన: జూపల్లి

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గీత కార్మికులు దశాబ్దాలుగా చెట్లు ఎక్కడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారని, వారికి పింఛన్ పెంచి గౌరవించాలనే ఆలోచన ఉందన్నారు. వృత్తిపై ఉన్న అపోహను తొలగించి ఈత వనాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్టార్ హోటళ్లలోనూ కల్లు విక్రయాలు జరగాలని కోరారు. నీర ఉత్పత్తి పెరిగి, గౌడల ఆదాయం పెరిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. గౌడ సోదరులు ప్రభుత్వానికి అండగా నిలబడాలని, జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఓటు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు.

ఢిల్లీలో సర్దార్ సర్వాయ్ పాపన్న విగ్రహం ఏర్పాటు: వంశీచంద్‌రెడ్డి

పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే మీరు కోరిన విధంగా మంత్రి పొన్నంప్రభాకర్ సహకారం, సీఎం రేవంత్‌రెడ్డి అండతో ఢిల్లీలో సర్దార్ సర్వాయ్ పాపన్న విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నిస్తానని చెప్పారు. మంత్రిగా ఉన్న శ్రీనివాస్‌గౌడ్ గౌడ కులస్థులకు చేసిందేమీ లేదన్నారు. ఆయన భూ కబ్జాలు చేస్తే, అదే కులం నుంచి మంత్రి అయిన పొన్నం ప్రభాకర్ భూ కబ్జాలు చేసిన వారిని జైలులో పెట్టించారన్నారు. ఇద్దరికీ ఉన్న తేడా గమనించాలని కోరారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు మనకు సెమీ ఫైనల్స్ అని, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తేనే ఫైనల్స్‌లో విజయం సాధించినట్లన్నారు. రాష్ట్రంలో 14-15 సీట్లు గెలవాలన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరులో ఎంపీగా గెలిచిన వ్యక్తి సీఎం అయ్యాక జిల్లాను అన్ని రంగాల్లో నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్‌కు వచ్చే నారాయణపేట డిపో ఆర్టీసీ బస్సులు బాగోలేవని, వాటి స్థానంలో కొత్త బస్సులు ఇవ్వాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్‌గౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, నాయకులు యుగంధర్‌గౌడ్, చంద్రకుమార్ గౌడ్, కుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చంద్రకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

- జిల్లాలో 95.3శాతం నమోదైన పల్స్ పోలియో



నాగర్‌కర్నూల్ బస్టాండ్ ప్రాంగణంలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్

కందనూలు, మార్చి 3 : జిల్లాలో నిర్వహించిన పల్స్ పోలియో 95.3శాతం నమోదైనట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ ఆదివారం తెలిపారు. ఇక ఎవరైనా చిన్నారులు మిగిలి ఉంటే సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.


కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌వో

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో, ఈదమ్మగుడి దగ్గర ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లో ఆదివారం డీఎంహెచ్‌వో డాక్టర్ కే సుధాకర్‌లాల్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5 సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. బస్టాండ్ పరిధిలో ప్రతీ ఒక్క బస్సును క్షుణ్ణంగా పరిశీలించి 0-5సంవత్సరాలలోపు ఉన్న వారిని గుర్తించి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. హైరిస్కు ఏరియాలైన ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, సంచార జాతుల నివాసాల్లో చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొబైల్ టీమ్‌లు వందశాతం వేయించాలని సూచించారు.

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్, ప్రోగ్రామ్ అధికారి కృష్ణమోహన్, మాస్ మీడియా అధికారి నరసింహ, రెడ్‌క్రాస్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, జిల్లా వ్యాక్సిన్ స్టోర్స్ మేనేజర్ కుమార్, పర్యవేక్షణ అధికారి కేశవులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొడుస్తున్న పొత్తు?

- బీఆర్ఎస్, బీఎస్పీల మధ్య ఎన్నికల అవగాహన!
- నాగర్‌కర్నూల్ బరి నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీ



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రాములు తనయుడు పోతుగంటి భరత్‌ప్రసాద్ బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు భారత రాష్ట్ర సమితి కృషి చేస్తోంది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు ఎంపీ టికెట్ కేటాయించాలని అనుకున్నప్పటికీ కొత్త సమీకరణలు తెరమీదకు వచ్చినట్లు తెలుస్తోంది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పొత్తుచర్చలు నడుస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీఆర్ఎస్, బీఎస్పీల మధ్య పొత్తు కుదిరితే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో ఉండే అవకాశం ఉంది. ఆ సంకేతాలు వచ్చినందునే రెండు రోజుల క్రితం కల్వకుర్తిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో తాను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బరిలో ఉండబోతున్నట్లు ప్రవీణ్‌కుమార్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే బీజేపీ నుంచి ఎంపీ పోతుగంటి రాములు తనయుడు భరత్ పేరు డిక్లేర్ కాగా, కాంగ్రెస్ నుంచి మల్లురవి లేదా సంపత్ కుమార్ బరిలో ఉండే అవకాశం ఉంది. బీఆర్ఎస్, బీఎస్పీల ఉమ్మడి అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రంగంలోకి దిగితే త్రిముఖ పోరు ఉండనుంది.

రాహుల్‌ను ప్రధాని చేయడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

- బీజేపీ, బీఆర్ఎస్‌లను మట్టి కరిపించాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, మార్చి3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే ధ్యేయంగా పార్లమెంటు ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లో పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పార్లమెంటు ఎన్నికల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి జూపల్లితో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ధనిక రాష్ట్రం అని అబద్ధపు గొప్పలు చెప్పుకున్న కేసీఆర్ పదేళ్ల దుర్మార్గపు పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాల బతుకులను చిన్నాభిన్నం చేశాయని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను మట్టి కరిపించి కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అప్పుడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సునాయాసంగా గెలువచ్చన్నారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మత రాజకీయాలు మరింత అధికమై దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలుగుతుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీఅని, రాష్ట్రంలో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేదన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువని, అందుకే రాష్ట్రంలో టికెట్ల విషయంలో పోటీ నెలకొందన్నారు. పార్లమెంటు అభ్యర్థుల ప్రకటనకు వారం, పది రోజులు పట్టే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచకుళ్ల దమోదర్‌రెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడిదల రాము, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు, తాడూరు జడ్పీటీసీ సభ్యురాలు రోహిణి పాల్గొన్నారు.

గల్లంతైన వృద్ధుడు శవమై తేలాడు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 3 : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రంలో గల్లంతైన ఎండీ. యాకుబ్(65) ఆదివారం శవమై తేలాడని ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలి పారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు కేసరి సముద్రం దగ్గరికి వెళ్లిన ఎండీ.యాకుబ్ ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. ఆదివారం శవం తేలడంతో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ఐ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి

దామరగిద్ద, మార్చి 3 : కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం దేశాయిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేశాయిపల్లి గ్రామానికి చెందిన సాలె హన్మప్ప తన గొర్రెల మందను రోజులాగే పొలం దగ్గర నిలపి రాత్రి రెండు గంటల తర్వాత నిద్ర పోయాడు. ఈ క్రమంలో ఒకే సారి 10 కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. గొర్రెల అరుపులకు సాలే హన్మప్ప తన కుమారుడు అంజిలప్ప నిద్ర లేచి కుక్కలను తరిమి కొట్టారు. ఈ సంఘనలో 16 గొర్రెలు మృతి చెందగా, మరో 20 గొర్రెలకు గాయాలు కావడంతో హన్మప్ప, తన కొడుకు అంజిలప్ప బోరున విలపిం చారు. చనిపోయిన గొర్రెల నష్టం రూ.రెండు లక్షల వరకు ఉంటుందని వా రు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

బాలికను కాపాడిన షీటీం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 3 : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి మాయమాటలను నమ్మిన బాలిక వాడి చెంతకు చేరేందుకు వెళ్తుండగా షీటీం సిబ్బంది పట్టుకుని తల్లిదండ్రులకు అప్పజెప్పిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. షీటీం అధికారి వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా రేవల్లి మండలానికి చెందిన బాలిక పదవ తరగతి చదువుతుంది. బాలికకు జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఇంటి వద్ద ఉంచి తమ ఫోన్ ఇచ్చి వ్యవసాయ పని కోసం వెళ్లారు. దీంతో సదరు బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తుండగా హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడితో పరిచయం ఏర్పడింది. దీంతో యువకుడి చెంతకు వెళ్లేందుకు నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు వచ్చి ఒక ప్రయాణికుని దగ్గర ఫోన్ ఇప్పించుకుని అతడికి ఫోన్ చేసింది. ఫోన్‌లో బాలిక మాట్లాడిన తీరును గమనించిన ఆ ప్రయాణికుడు చాకచక్యంతో షీటీం అధికారులకు సమాచారమందించారు. దీంతో షీటీం అధికారి బాలికను విచారించగా అసలు విషయం బయట పడింది. బాలిక తల్లిదండ్రులకు సమాచారమందించి బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు.

అవినీతిని నిరూపించాలి

- భూ నిర్వాసితులకు ఎకరానికి రూ.15 లక్షల పరిహారం ఇప్పించాలి
- విలేకరుల సమావేశంలో జడ్పీవైస్ చైర్మన్ యాదయ్య



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

జడ్చర్ల, మార్చి 3: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగంగా ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ప్రాజెక్ట్ డిజైన్ మార్చి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించడం తగదని జడ్పీవైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదండాపూర్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రిజర్వాయర్‌కు సంబంధించిన కాంట్రాక్టరును అడిగి తెలుసుకొని నిజాలు మాట్లాడాలన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు రూ.15 లక్షలు ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తానని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జడ్చర్ల అభివృద్ధిపై ఏనాడు కూడా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మల్లురవి వ్యక్తిగత విమర్శలు చేయలేదన్నారు. ఎమ్మెల్యే హోదాను మరచి పదజాలంతో వ్యక్తిగత దూశణలకు దిగితే, తాము కూడా అదే విధంగా స్పందించాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో బాదేపల్లి సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ పిట్టల మురళి, కౌన్సిలర్ సతీష్, నరసింహ, నాగిరెడ్డి, ఇమ్ము, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో జాతీయ స్థాయిలో రాణించాలి



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

జడ్చర్ల, మార్చి 3 : హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర జట్టు జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీలలో అభిలాష్, శివకుమార్, పవన్, చరణ్, శ్రీను, సక్కురామ్, శేష్, విజయ్, నికేశ్వర్, అరవింద్, ఉదయ్‌కిరణ్, శివ, ప్రకాష్, జ్యాసన్, గాంధీ, దేవ్‌సింగ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు వరంగల్ జిల్లాలో 45వ రాష్ట్ర అంతర్‌జిల్లాల హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ఫెరోజ్, శివకుమార్, వినయ్, ఓంకార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

» వేసవి రాకముందే బోర్లలో నీరు తగ్గుముఖం » కొత్త బోర్లు వేస్తున్నా ఫలితం శూన్యం
» గొర్రెలు, పశువుల మేతకు పంటలు » కేటీ దొడ్డి మండల రైతుల ఆవేదన



కేటీదొడ్డి శివారులో గొర్రెల మేతకు వదిలేసిన వరి పంట

కేటీదొడ్డి, మార్చి 3 : బోర్లలో నీళ్లు ఉన్నాయని, ఈ సీజన్‌కు సరిపోతాయని చాలా మంది రైతులు పంటలు వేసుకున్నారు. కానీ వేసవికి ముందే బోర్లలో నీరు తగ్గుముఖం పట్టింది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కనీసం పంటల సాగుకు అయిన పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న బోర్లలో నీరు లేక, కొత్త బోర్లు వేసుకున్నా ఫలితం లేదని ఆందోళన చెందుతున్నారు. కేటీదొడ్డి మండలంలో రైతులు బోర్లపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. మండలంలో సాధారణ వర్షపాతం 52 సెంటీమీటర్లు కాగా, ఈ ఏడాది 37 సెంటీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడ్తున్నారు.

14,019 ఎకరాల్లో పంటల సాగు

మండలంలో మొత్తం 14,019 ఎకరాల సాగుభూమి ఉంది. అందులో రైతులు 6,750 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అలాగే 179 ఎకరాల్లో పొగాకు, 24 ఎకరాల్లో ఆముదం, 2,180 ఎకరాల్లో వేరుశనగ, 80 ఎకరాలలో టమాట పంటలు వేసుకున్నారు. మొత్తంగా 9,213 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. కానీ పంటలకు సాగునీరందే పరిస్థితి కన్పించడం లేదు. సాగునీటి కోసం ఒక్కో రైతు మూడు, నాలుగు బోర్లు వేస్తున్నారు. కానీ ఒక్క బోర్లోనూ నీరు రావడం లేదు. వచ్చినా పది, పదిమేను రోజులకే నీరు తగ్గుముఖం



కేటీదొడ్డిలో ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట

పడ్తోంది. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోతుంటే చూసి తట్టుకోలేక గొర్రెలు, పశువుల మేతకు వదిలేస్తున్నారు. దీంతో పలువురు రైతులు కుటుంబాలతో కలిసి హైదరాబాద్, బెంగళూరు, రాయచూరు తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కొందరు స్థానికంగా కూలి పనులు చేసుకుంటున్నారు. గట్టు ఎత్తిపోతల పథకం పూర్తయితేనే ఈ ప్రాంతంలో పంటలకు సాగునీరు అందుతుంది. అప్పటి వరకు తమకు ఈ దుస్థితి తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి ఎండిపోయింది



వీరన్న, కేటీదొడ్డి : బోర్ల ద్వారా నీరు అందించొచ్చన్న ఆశతో వరి సాగు చేశాను. కానీ బోరు ఎండిపోయింది. ఎలాగైనా పంటను కాపాడుకోవాలని రెండు బోర్లు వేయించినా చుక్క నీరు రాలేదు. గట్టు ఎత్తిపోతల పథకం పూర్తయితేనే ఈ ప్రాంతంలో పంటలకు నీరందుతుంది.

నాలుగు బోర్లు వేసినా...



గోవర్ధన్, కేటీదొడ్డి : వరి, వేరుశనగ పంటలు సాగు చేశాను.. బోర్లు అడుగంటడంతో నీరు సరిపోక పంటలు ఎండిపోతున్నాయి. అప్పులు చేసి, పది రోజుల్లో నాలుగు బోర్లు వేశాను. ఒక్క దానిలోనూ నీరు రాలేదు. దీంతో వరి, వేరుశనగ రెండు పంటలు ఎండిపోతున్నాయి.

ప్రజల నుంచి వచ్చిందే అభ్యుదయ కవిత్వం

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
- అభ్యుదయ రచయిత సంఘం ఉమ్మడి జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 3: ప్రజల నుంచే కవిత్వం రావాలని, ఆ దిశగా ఏర్పడిన సంఘమే అభ్యుదయ రచయితల సంఘమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ మందిరంలో అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఉమ్మడి జిల్లా మహాసభలు నిర్వహించారు. అరసం జిల్లా అధ్యక్షుడు కల్వకోలు మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ మార్పు కోసం ఏర్పడిన సంఘమే అరసం అని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కన్నా ముందే ప్రగతిశీల భావాలతో ఏర్పడ్డ సమాజంలో అభ్యుదయ కవులెంతో మంది పని చేశారన్నారు. కొడవటిగంటి కుటుంబరావు, బాల్లిముంత సాంబశివరావు, రాచమల్లు చాసో, తాపీ ధర్మారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి కృష్ణమాచార్య వంటి ఎందరో మహా కవులు అభ్యుదయ సంఘాన్ని నడిపారన్నారు. వీరికన్న ముందు గౌతమ బుద్ధుడు, మహాత్మ జ్యోతిరావు పూలే, వీరబ్రహ్మం, వేమన, కబీరు, నారాయణ గురు, బాబా సాహెబ్ అంబేడ్కర్ లాంటి మహనీయులు పోరాడిన మార్గమే అభ్యుదయ మార్గమని, అరసం సంఘం పుట్టుకకు కారమణన్నారు. అనంతరం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ నాయకుడు వేల్పుల నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రాపోలు సుదర్శన్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరాస్వామి మాట్లాడుతూ అరసం ఏర్పడిన నాటి నుంచి ప్రాచుర్యం పొందిన రచనలను, కవులను కొనియాడారు. పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు రాఘవాచారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏళేశ్వరం వెంకటేష్, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, బొడ్డుపల్లి సాయిశంకర్, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఆనంద్‌జీ, సీనియర్ జర్నలిస్టు కందికొండ మోహన్, కవులు భీంపల్లి శ్రీకాంత్, లక్ష్మణ్‌గౌడ్, వనపట్ల సుబ్బయ్య, వహీద్‌ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, శ్యామల, పద్మావతి, డాక్టర్ ఎల్.విజయ, హారిని, కేపీ లక్ష్మీ, నరసింహ, ప్రతాప్‌కౌటిల్య, గుడిపల్లి నరసింహారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి, డి.రాములు, ముచ్చర్ల దినకర్, నూనే క్రాంతి, కళాకారుల సంఘం కురుమూర్తి, గోపాల్, పర్వతాలు, సంతోష్, సురేష్, మధు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కారు బోల్తా

- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

తాడూరు, మార్చి 3 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామ సమీపంలో కారు ప్రమాదవశాత్తు ఆదివారం సాయంత్రం రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...యాదిరెడ్డిపల్లి నుంచి ఐతోల్ వైపు వస్తున్న కారు ప్రమాదవశాత్తు బండమీదితండా సమీపంలో ప్రమాదవశాత్తు కారు బోల్తా పడింది. ఈ సమయంలో కారులో సుమారుగా నలుగురు ఉన్నట్లు సమాచారం. ఎవరికీ పెద్దగా దెబ్బలు తగలకపోవడంతో పెను ప్రమాదం తప్పిందంటూ ఊపిరి పీల్చుకున్నారు. మొత్తంగా కారు బోల్తా పడడంతో ఆ ప్రాంతంలో భయానక పరిస్థితి నెలకొంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

ఉప్పునుంతల, మార్చి 3: మహిళ అదృశ్యం అయిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలో చోటుచేసుకొంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం... ఓ గ్రామానికి చెందిన మహిళను నల్లగొండ జిల్లా డిండి మండలంలోని ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యానికి గురి కావడంతో ఇటీవల పుట్టింటికి వచ్చింది. మెడిసిన్ వేసుకోవాలని తల్లి మదలించడంతో ఆమె మనస్తాపానికి గురై ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తమ్ముడు ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఎం సభా స్థలం పరిశీలన



ఎంవీఎస్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, మార్చి 3 : ఈనెల 6న ఎంవీఎస్ కళాశాల మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాదీవెన సభ నేపథ్యంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు మైదానాన్ని పరిశీలించారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డితో పాటు ఇతర ముఖ్య నాయకులు మైదానాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. జనసమీకరణ, బందోబస్తు పరంగా అక్కడ ఉన్న వసతులను పరిశీలించారు.

సభకు ఎలాంటి ఇబ్బందులు కల గకుండా విజయవంతం చేయాలని కాంగ్రెస్ నా యకులు ప్రయత్నిస్తున్నారు. భారీగా జనసమీకర ణ చేసే అవకాశం ఉన్నందున స్థలాన్ని మరోసారి నాయకులు పరిశీలించారు.

పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర బృందం

తాడూరు, మార్చి 3 : పల్స్ పోలియో కార్యక్రమం అమలుపై ఆదివారం తాడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న పోలియో చుక్కల కార్యక్రమంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, నర్సింహారెడ్డిలు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో అమలవుతున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, అమలులో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్‌నాయక్, వైద్యాధికారులు కృష్ణ, సంతోష్ అభిరామ్, జిల్లా మాస్ మీడియా అధికారి నరసింహ, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్.శ్రీనివాసులు, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, పర్యవేక్షణా అధికారులు నటరాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో మెడికల్ కాలేజీ వద్దు

- ఏర్పాటు ప్రతిపాదన మార్చుకోవాలి : మానవ హక్కుల వేదిక

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో నూతనంగా నిర్మించతలపెట్టిన మెడికల్ కాలేజీ ప్రతిపాదనను మార్చుకోవాలని రాష్ట్ర మానవహక్కుల వేదిక డిమాండ్ చేసింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామంలో పేద, బలహీన వర్గాల భూములను మెడికల్ కాలేజీ కోసం స్వాధీనం చేసుకోవడంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో ఆదివారం మానవహక్కుల వేదిక రాష్ట్ర కమిటీ ఆ గ్రామాన్ని సందర్శించింది. బాధితులను కలిసి వివరాలు సేకరించింది. ఆ గ్రామంలోని సర్వే నెంబర్ 19లోని 75 ఎకరాల భూమిని 1972 ప్రాంతంలో 47 కుటుంబాలకు జీవనాధారంగా అసైన్డ్ పట్టాలను అందించినట్లు మానవహక్కుల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. నాడు రాళ్లురప్పలతో ఉన్న భూమిని వారంతా కష్టపడి సాగు చేసుకున్నారని, ప్రస్తుతం 150 కుటుంబాలు ఆ భూమే ఆధారంగా బతుకుతున్నాయని వెల్లడించింది. సీఎం రేవంత్ తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటం కోసం మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలనే ఆలోచనను మానవహక్కుల సంఘం తప్పుపట్టింది. వైద్య కళాశాలతో అభివృద్ధి జరగదని, ఇప్పటికే తెలంగాణలో మెడికల్ కాలేజీలు అశాస్త్రీయంగా ఉన్నాయని పేర్కొంది. ఆ ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులోకి రావాలంటే నిమ్స్‌లాంటి ఆస్పత్రిని కట్టాలని సూచించింది. కాగా, అప్పాయిపల్లి శివారులో 198 సర్వే నెంబర్లో 50 ఎకరాలు, పలుగురాళ్ల తండాలోని 450 సర్వే నెంబరులో 250 ఎకరాల సర్కారు భూమి ఉందని స్థానికులు చెబుతున్నట్లు పేర్కొంది. సీలింగ్ చట్ట పరిధి దాటిన వందల ఎకరాల భూములు ఇంకా బినామీ పేర్లతో భూస్వాముల చేతుల్లో ఉన్నాయని, వాటిని వదిలేసి నిరుపేద కుటుంబాల జీవనాధారమైన భూమిని లాక్కోవాలని చూడటం హేయమైన చర్య అవుతుందని అభిప్రాయపడింది. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఆదివారం జరిగిన నిజనిర్ధారణ కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త వి. వసంతలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ బొల్లి ఆదంరాజు, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్, వెంకటనారాయణ, టి. రోహిత్, జి. మధు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- పేదల తిరుపతిగా ప్రసిద్ధి - ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



వేంకటేశ్వరస్వామి దేవాలయం

కల్వకుర్తి, మార్చి 3 : కల్వకుర్తి పట్టణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 5 నుంచి 7వరకు జరిగే ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత 32 సంవత్సరాల క్రితం దివంగత కల్వ నారాయణ ఆధ్వర్యంలో దాతల సహకారంతో దేవాలయం నిర్మితమైంది. దేవాలయంలో లక్ష్మీపద్మావతి, వేంకటేశ్వరస్వామి, అన్నపూర్ణ, కాశీశ్వర, ఆదిపంచముఖ ఆంజనేయస్వామి, నవగ్రహ మూలవిరాట్‌లు ఉన్నాయి. దేవాలయం పేదల తిరుపతిగా ప్రసిద్ధిగాంచింది. ప్రతి సంవత్సరంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతాయి. బ్రహ్మోత్సవాలను మంగళవారం నుంచి 7వరకు నిర్వహిస్తున్నామని, అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆలయ ఫౌండర్ ట్రస్టీ కల్వ మనోహర్ తెలిపారు.



లక్ష్మీపద్మావతి, వేంకటేశ్వరస్వామి మూల విరాట్

● **బ్రహ్మోత్సవ కార్యక్రమాలు**

మంగళవారం స్వామి వారికి ఉదయం 5గంటలకు సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. 8గంటలకు గణపతి పూజ, 10గంటలకు భగవద్గీత పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం, సాయంత్రం 6:30గంటలకు స్వామి వారి ఎదుర్కోళ్లు ఉంటాయన్నారు. ఈ నెల 6న ఉదయం 5గంటల నుంచి సుప్రభాత సేవ, దేవతారాధనలతో ప్రారంభమై సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. సాయంత్రం 6గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, 7వ తేదీన స్వామి వారికి పూజా కార్యక్రమాలతో పాటు సాయంత్రం 6గంటలకు గరుడ వాహన సేవ ఉంటుందని కల్వ మనోహర్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

దాసంగాల రాయుడికి... దాసోహం

- వైభవంగా చింతల మునిరంగస్వామి జాతర ఉత్సవాలు



మునిరంగస్వామికి దాసంగం పెట్టి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

భూత్పూర్, మార్చి 3 : దాసంగాల రాయుడికి దాసోహం అంటూ భక్తులు చింతల మునిరంగస్వామికి దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకుంటు న్నారు. మునిసిపాలిటీ పరిధిలోని 44వ జాతీయ రహదారి పక్కన వెలిసిన చింతల మునిరంగస్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గత ఫిబ్రవరి 29 నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభయ్యాయి. ఈ జాతరలో చింతల మునిరంగస్వామికి దాసంగాలు పెట్టి భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాతీ. ఆదివారం నాలుగో రోజు స్వామివారి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యంలో తరలివచ్చి స్వామికి మొక్కులు తీర్చుకుంటున్నారు. జాతరలో తినుబండారాలు, మిఠాయిదుకాణాలు, మహిళలకు గాజులు వేసుకోవడానికి రంగు రంగుల గాజులతో కూడిన దుకాణాలు వెలిశాయి. అదే విధంగా పిల్లల కోసం రంగుల రాట్నాలు, రకరకాల దుకాణాలు భక్తులను ఆకర్శించేవిధంగా వెలిశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, యక్షగానాలు ఆలపించే కార్యక్రమాలు చేపడుతున్నారు. పిల్లలకు వినోదాలను అందించే ఆటబొమ్మలు, మట్టితో తయారు చేసిన కుండలు అనేక రకాల వస్తువులు, ఈ జాతరలో వెలిశాయి. వారం రోజుల పాటుగా ఈ జాతర ఉత్సవాలు జరగనున్నాయి.

విజయవంతమైన పోలీస్ హెల్త్‌క్యాంపు



పోలీసుల మెగా హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎస్పీ

నాగర్‌కర్నూల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఉచిత మెగా హెల్త్ క్యాంపును జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ కార్యాలయ సముదాయంలో నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపును జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రారంభించారు. ఈ క్యాంపులో 14మంది స్పెషలిస్టు డాక్టర్లతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపుగా 500మందికి పైగా పోలీస్ కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఏఆర్ ఆడిషనల్ ఎస్పీ భరత్, డీసీఆర్‌బీ డీఎస్పీ సత్యనారాయణ, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, అచ్చంపేట, కల్వకుర్తి డీఎస్పీలు పాల్గొన్నారు. వైద్య శిబిరం విజయవంతం కావడంతో పోలీస్ సిబ్బందిని, వారి కుటుంబ సభ్యులను ఎస్పీ అభినందించారు.

మనోధైర్యంతో ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

వంగూరు, మార్చి 3: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఓటమి బాధను మరచిపోయి మనోధైర్యంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం వంగూరులో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులకు సాగునీరు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మండిపడ్డారు. డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌ని ఆదరిస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చూపించాలన్నారు. గణేష్‌రావు, అంకు సురేందర్, తవిటి నాగేష్, బాలస్వామిగౌడ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం



విలేకరులతో మాట్లాడుతున్న మల్లురవి

వెల్దండ, మార్చి 3 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రాష్ట్రప్రభుత్వం అమలుచేసి ప్రజల అభిమానం చూరగొంటుందని మాజీ ఎంపీ మల్లురవి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మల్లురవి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లుగా ఆరు గ్యారెంటీలను అమలుచేస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాము ఇంకా అధికారంలోనే ఉన్నామనే భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతుందని మండిపడ్డారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలో నాగర్‌కర్నూల్ నుంచి బరిలో ఉంటానని, అధిష్ఠానం మద్దతు తనకే ఉందని మల్లురవి ధీమా వ్యక్తంచేశారు. తనకు ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం ఇచ్చినా ఎంపీగా బరిలో ఉండాలన్నదే తన ఆశయమని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకుంటామని, పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా మల్లురవి సూచించారు. సమావేశంలో నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

చౌడేశ్వరీ దేవికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



బిజినేపల్లిలో యాదవులతో కలిసి చౌడేశ్వరీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి

బిజినేపల్లి, మార్చి 3 : మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి యాదవులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మొదటిసారి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి యాదవులు సాంప్రదాయ వాయిద్యాల చప్పుడుతో ఆటపాటలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలోని అమ్మవారికి హారతి, అభిషేకం చేశారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు సోమవారం బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

హజ్రత్ దర్వేష్ ఖాద్రి దర్గా ఉత్సవాలు ప్రారంభం



జటప్రోల్ కృష్ణానది తీరంలోని దర్గా దగ్గర భక్తులు

పెంట్లవెల్లి, మార్చి 3 : మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో కృష్ణానదిలో వెలసిన హజ్రత్ దర్వేష్ ఆలీషా ఖాద్రి దర్గా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పురాతనమైన దర్గా దగ్గర ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొంతమంది దాతల సహాయంతో దర్గా దగ్గరకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం 7:30గంటలకు ఖవ్వాలి ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు మహమ్మద్ బురానుద్దీన్‌షా పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్గా నిర్వాహకులు అన్ని వసతులు కల్పించారు.

'సీనియర్ నాయకులకు సముచిత స్థానం'

కొల్లాపూర్, మార్చి 3 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా క్యాబినెట్ స్థాయి హోదా కల్పించి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నారెడ్డికి సీఎం సముచిత స్థానం కల్పించారని మహబూబ్‌నగర్ జిల్లా మాజీ మునిసిపల్ చైర్మన్ సీనియర్ నాయకుడు ఒబెదుల్లాకొత్వాల్‌కు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పజెప్పడంపై రంగినేని జగదీశ్వరుడు హర్షం వ్యక్తం చేశారు. వీరి ఎన్నిక పట్ల సహకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా మల్లురవికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టికెట్ కేటాయిస్తుందని, భారీ మెజార్టీతో ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్, జిల్లా కార్యదర్శి కంటె శివన్న తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు చుక్కల కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. పలు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. జిల్లాలో నిర్వహించిన పల్స్ పోలియో 95.3శాతం నమోదైనట్లు జిల్లా అధికారులు తెలియజేశారు.



పోలియో చుక్కలు వేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం



తెలకపల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా వైద్యాధికారి కే సుధాకర్‌లాల్

పోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

తెలకపల్లి, మార్చి 3 : మండల పరిధిలోని రాకొండ, చిన్నముద్దునూర్ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే సుధాకర్‌లాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఏ ఒక్క చిన్నారిని వదిలిపెట్టకుండా వంద శాతం వేయించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కే.రవికుమార్, డాక్టర్‌ప్రదీప్, డాక్టర్ సందధ్య, రమేష్‌రెడ్డి, జిల్లా వ్యాక్సిన్ స్టోర్స్ మేనేజర్ కుమార్, పర్యవేక్షణ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి: రెండు పోలియో చుక్కలు నిండు జీవితానికి నిదర్శనమని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో భాగంగా పోలియో చుక్కలను మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం చిన్నారులకు వేశారు. అదేవిధంగా కల్వకుర్తి మునిసిపల్‌లోని ఏడవ వార్డులో కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, ఇందిరానగర్ 21వ వార్డులో కౌన్సిలర్ సైదులుగౌడ్ పోలియో చుక్కలను పంపిణీ చేశారు. ఏఎన్ఎం ప్రేమలత, ఆశ వర్కర్ రామేశ్వరమ్మ, శైలజా, అంగన్‌వాడీ టీచర్ సుజానమ్మ, ఆయా లింగమ్మ తదితరులు ఉన్నారు.

● వంగూరు: అప్పుడే పుట్టిన పసిపాప నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని స్పెషలాఫీసర్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం వంగూరులో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 3,170 మంది పిల్లలకు పోలియోచుక్కలు వేసేందుకు గుర్తించామని, ఇందులో 95 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. సీహెచ్‌వో సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారి బిక్కు నాయక్ చిన్నారులకు చుక్కల మందు వేసి ప్రారంభించారు. మండలంలో 31 కేంద్రాల్లో 124 వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 2942 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల, ఈర్లటోనిపల్లి, వెల్టూరు గ్రామంలోని పల్స్‌పోలియో కేంద్రాలను జిల్లా ఉపవైద్యాధికారి గీత పరిశీలించారు.

భారం అనుకోకుండా చుక్కలు వేయించాలి

● బల్మూరు: చిన్న పిల్లలకు రాబోయే కాలంలో వికలాంగులు ఇతర అవయవాల మార్పు జరగకుండా చేసేందుకు పల్స్ పోలియో చుక్కలు ఎంతో దోహదపడుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు డీఎంహెచ్‌వో గీత అన్నారు. ఆదివారం మండలంలోని కొండనాగుల, బల్మూరు, అనంతవరం గ్రామాల్లో పల్స్ పోలియో సెంటర్లను ఆమె పరిశీలించారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పని చేస్తున్న సిబ్బంది ఫార్మాసిస్టు కుమార్ ఆచారి, సీహెచ్‌వో విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ గంగానాయక్, సోమని సక్రియ, సూపర్‌వైజర్ అంజనమ్మ, సిబ్బంది శ్వేతా, లక్ష్మీ, రత్నబాయి, జ్యోతి పాల్గొన్నారు.

● వెల్దండ: పల్స్‌పోలియో కార్యక్రమం మండలంలో విజయవంతమైంది. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది వివిధ గ్రామాలలో 4873 మంది 0-5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలకేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమంలో మాజీ ఎంపీ మల్లురవి పాల్గొని, స్థానిక నాయకులతో కలిసి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూప, వైద్యసిబ్బంది ఉన్నారు.

● చారకొండ: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యింది. ఈసందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ మంజు భార్గవి మాట్లాడారు. మండలంలో 2026 మంది చిన్నారులను గుర్తించామని 96 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని అన్నారు. తహసీల్దార్ కేసీ ప్రమీల, సీహెచ్‌వో శేఖర్‌రెడ్డి, హెఈవో ఎన్టీవీ చారి, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: గ్రామాల వారీగా సోమవారం ఇంటింటికి వెళ్లి మిగిలిపోయిన ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారిణి స్వప్న, హెచ్ఈవోలు విద్యాసాగర్, విజయ్‌కుమార్, ఫార్మాసిస్టు బాలరాజు, సూపర్‌వైజర్ గౌస్ ఉన్నారు.

పక్షవాతం పిల్లల దరి చేరనియొద్దు

బిజినేపల్లి: శిశు పక్షవాతంను పిల్లల దరి చేరనియొద్దని ప్రతి చిన్నారినికి బాధ్యతగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని గంగారంలో ఆదివారం పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ప్రారంభించి మాట్లాడారు. బిజినేపల్లి, లట్టుపల్లి, తిమ్మాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యసిబ్బంది పోలియో చుక్కల పంపిణీ పనితీరును ఆయన పరిశీలించారు. వైద్యులు డాక్టర్ ఆలోచన, డాక్టర్ శివకుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ తేజస్విని, డాక్టర్ మేఘనా రెడ్డి, వైద్య సిబ్బంది విద్యాసాగర్, విజయ్ కుమార్, కిష్టమ్మ, రాణి, తాళ్ల యాదగిరి, నగేష్, సలీం, పద్మ, గంగా, హెలెన్ తదితరులు ఉన్నారు.

● పెంట్లవెల్లి: చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి అని జటప్రోల్ ఏఎన్ఎం సుమిత్ర అన్నారు. ఆదివారం మండలంలోని జటప్రోల్, గోప్లాపూర్, పెంట్లవెల్లి, కొండూరు, మంచాలకట్ట, మల్లేశ్వరం, యంగంపల్లితండా తదితర గ్రామాల్లో చిన్నారులకు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండలంలో మండల వైద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండలంలోని వివిధ గ్రామాల్లో 28 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలు 5744మందికిగాను 5378మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ రోహిత్‌కుమార్ తెలిపారు. సీఎస్‌వో జీవీశ్రీనివాసులు, సూపర్‌వైజర్ బాలాజీసింగ్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనరసింహగౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: పోలియో రహిత భారత్ నిర్మిద్దామని కాంగ్రెస్ మండల యువజన అధ్యక్షుడు కంఠం విజయుడు అన్నారు. మండల కేంద్రంలో పాటు ఊర్కొండపేట, బొమ్మరాజుపల్లి తదితర గ్రామాల్లో నాయకులు, అధికారులు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద పోలియో చుక్కలు వేయించుకోవాలని తెలిపారు. వైద్య ఆరోగ్య పర్యవేక్షకులు ప్రసాద్, రామచంద్రా రెడ్డి, నాయకులు అరీఫ్, శివకుమార్ వెంకటేష్ పాల్గొన్నారు.

● తాడూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఆదివారం పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాల్సిందిగా సూచించారు. వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● లింగాల: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. లింగాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో మొత్తం 9పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆయా కేంద్రాలలో 1942 మంది, మండల పరిధిలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 17 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి 1786 మంది 0-5సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కల మందును వేసినట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు అనిల్‌కుమార్ ప్రశాంత్ తెలిపారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సబ్‌సెంటర్లలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో విజయవంతమైంది. జడ్పీటీసీ డాక్టర్ అనూరాధ పాల్గొని చిన్నారులకు చుక్కల మందును పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరికి చుక్కల మందు పంపిణీ చేసే వరకు మరో రెండు రోజులు సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్, కోఆప్షన్ సభ్యుడు రహీం, ఆరోగ్య సిబ్బంది కవిత, తిరుపతమ్మ, లోక్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● అమ్రాబాద్: పదర, అమ్రాబాద్ మండలాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 15 సెంట్రల్ ద్వారా 1433 చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 24 సెంట్రల్ ద్వారా 3124 చిన్నారులకు సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి అడిషనల్ డీఎంహెవో డాక్టర్ తారా సింగ్ అమ్రాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో సెంటర్‌ను తనిఖీ నిర్వహించి చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. డివిజన్ ఉప మలేరియా అధికారి అశోక్ ప్రసాద్, మదన్మోహన్, వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ తారా సింగ్ తదితరులు

● కొల్లాపూర్: ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు మండలంలోని ప్రతి గ్రామంలో స్పెషల్ క్యాంపు నిర్వహించి అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పోలియో చుక్కలు వేశారు. మండల పరిధిలోని అమరగిరి గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తమ వంతు సహకారాన్ని అందించారు. గ్రామంలో ఉన్న ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేశారు. అమరగిరిలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవరాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



అమరగిరి గ్రామంలో చెంచు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు



కొండనాగులలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత



ఊర్కొండలో పోలియో చుక్కలు వేస్తున్న నాయకులు, అధికారులు



తాడూరులో పోలియోచుక్కల పంపిణీ సందర్భంగా చుక్కలు వేస్తున్న మెడికల్ ఆఫీసర్ కృష్ణయ్య

బస్సులో ప్రయాణం.. ప్రజలతో మమేకం..

- మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ

- పల్స్‌పోలియో కేంద్రాల పరిశీలన

అచ్చంపేట, మార్చి 3 : ఆయన దృష్టంతా ప్రజాపాలనపైనే.. ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రజలతో మమేకమై, బస్సులో ప్రయాణించి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పండ్ల వ్యాపారులతో ముచ్చటించారు. అచ్చంపేట ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చిరువ్యాపారులను పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా వారికి భరోసా కల్పించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించి మహిళలను పలకరించారు. ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాలను సందర్శించి పోలియో చుక్కలు వేయించడం వల్లకలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు ఈ సందర్భంగా వివరించి, చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. పోలియోను అంతమొందించి పోలియో రహిత దేశాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. అంతకుముందు చాయ్ హోటల్ వద్ద ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనాలు చదివారు. ఎమ్మెల్యేతో పాటు రాజేందర్, గోపాల్‌రెడ్డి, మల్లికార్జున్, గౌరీశంకర్ ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● బల్మూరు : కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని గత అసెంబ్లీ ఎన్నికల్లో పని చేసినట్లుగానే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాంనగర్ గ్రామపంచాయతీలో ఒక కాంగ్రెస్ నాయకుడి మామిడి తోటలో ఏర్పాటు చేసిన మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు దిశానిర్దేశం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, మండల సీనియర్ నాయకులు శ్రీపతిరావు, నర్సింగ్‌రావు, సుధాకర్‌గౌడ్, ఖదీర్, కాశన్నయాదవ్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు గిరివర్ధన్‌గౌడ్, మైసన్న, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్నింగ్ వాక్‌లో పండ్ల వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

శివస్వాములకు అన్నదానం ప్రారంభం

మన్ననూర్: నారాయణపేట జిల్లా మాగనూరు మండలం గూడెబల్లూరుకు చెందిన శివ భక్త బృందం ఆధ్వర్యంలో మన్ననూరు గ్రామంలో శ్రీశైలం వెళ్లే పాదయాత్ర శివస్వాములకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదివారం ప్రారంభించారు. 20ఏళ్లుగా మన్ననూరు శివస్వాములకు సేవ చేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే నిర్వాహకులను అభినందించారు. కోఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీటీసీ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, శివాజీ, బాలస్వామి, రమేష్, హతీరాం, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవాలి

ఉప్పునుంతల, మార్చి 3: విద్యార్థులు ప్రణాళికతో చదివినప్పుడు లక్ష్యాన్ని చేరుకుంటారని మోటివేషనల్ స్పీకర్ టీచరు గాజుల వెంకటేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని కేజీబీవీ బాలిక పాఠశాలలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా ప్రాముఖ్యత పరిక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారు.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 10 తరగతి విద్యార్థులకు పెన్నులు అందచేశారు. ఉపాధ్యాయులు రవీందర్, భూపతికుమార్, శ్రీనివాస్, ఎస్‌వో సైదా తదితరులు ఉన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

చారకొండ, మార్చి 3: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈనెల 5న జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి అన్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజు కూలీ రూ. 600 ఇవ్వాలని 200 ల రోజులు పని దినాలను కల్పించాలని అన్నారు. పని ప్రదేశంలో మృతి చెందిన కూలీలకు రూ. 10 లక్షలు పరిహారం తదితర అంశాలపై సమావేశంలో చర్చిడం జరుగుతందని అన్నారు. మండలంలోని ఉపాధి కూలీలు, మేట్లు, వాచర్స్ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

కల్యాణోత్సవం పోస్టర్ విడుదల

వెల్దండ, మార్చి 3 : మండలకేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 8న నిర్వహించే వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్యమహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, ఎర్రశ్రీను, నిర్వాహకులు రాజయ్య, అన్నదానం కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడికి అభినందనల వెల్లువ



చిన్నారెడ్డికి అభినందనలు తెలుపుతున్న కేవీఎస్‌రెడ్డి

వంగూరు, మార్చి 3: రాష్ట ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చిన్నారెడ్డిని ఆదివారం మండల జడ్పీటీసీ సభ్యుడు కేవీఎస్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. చిన్నారెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 3: పరీక్షలు సమీపిస్తున్న వేళ హాస్టల్ వార్డెన్‌లు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కంచి వారి సమస్యలు పరిష్కరించాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వార్డెన్‌లు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే మెనూ ప్రకారం భోజనం అందించి ఆరోగ్య, మానసిగ ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఎస్ఎఫ్ నాయకులు కృష్ణ, తరుణ్, సాయిబాబు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నాగరాజు

ఉప్పునుంతల, మార్చి 3: ఆదివారం అచ్చంపేట పట్టణంలోని సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పునుంతల మండల సీపీఎం కార్యదర్శిగా నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దేశ్యానాయక్, మండల నాయకులు శ్రీరాములు, లక్ష్మయ్య, రాములు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కల్వకుర్తి, మార్చి 3 : క్రీడలతో మానసికోల్లాసం చేకూరుతుందని క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనరసింహారావు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో క్లాస్‌మేట్ క్లబ్, రాగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో కల్వకుర్తి నియోజకవర్గం, డివిజన్ పరిధిలోని 9మండలాల ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం చేకూరుతుందన్నారు. క్లాస్‌మేట్ క్లబ్ నాయకులు శోభన్‌బాబు, రాజు, చంద్రమోహన్, శశాంక్, వివిధ సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెంచులకు రాగి పాయసం పొడర్ పంపిణీ

కొల్లాపూర్, మార్చి 3 : కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి గ్రామంలో ఆదివారం 60చెంచు కుటుంబాలకు అన్నపూర్ణ ట్రస్టు బెంగళూరు వారి సహకారంతో మధుసూదన్‌సాయి ఆశీస్సులతో రాగి పాయసం పౌడర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ ట్రస్టు ఇన్‌చార్జి అల్వాల అర్జున్‌గౌడ్ మాట్లాడుతూ వేసవిలో చెంచులు ఆరోగ్యం దృష్ట్యా సురక్షితంగా ఉండడానికి వారికి పౌష్టికాహారం అందేలా అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో రాగి పౌడర్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నార్లపూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బషర్ అహ్మద్, అమరగిరి చెంచులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అమ్రాబాద్, మార్చి 3: ఓ యువతి అదృశ్యం అయిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో చోటు చేసుకొంది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వంగరోనిపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి రెండు రోజుల నుంచి కనిపించకుండా పోయిందని యువతి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు.

మైసమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దకొత్తపల్లి, మార్చి 3 : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తులకు కొంగుబంగారంగా వెలసిన మైసమ్మ దేవత దర్శనం కోసం ఈ ఆదివారం భక్తులు తగ్గారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం దాదాపు 15వేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకుని తమ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 3: ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా మల్కాపూర్ స్టేజ్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రాము కుటుంబ సభ్యులతో కలిసి నాయినోనిపల్లి మైసమ్మ దగ్గరికి ఆటోలో బయల్దేరారు. మల్కాపూర్ స్టేజీ సమీపంలోకి రాగానే నాగర్‌కర్నూల్ వైపు నుంచి వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురికి గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్న ఒకరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.